క్లుప్తంగా

నర్సరీ సందర్శన



ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆదివారం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వైఎస్సార్ సీపీ కడియం మండల యూత్ కన్వీనర్ కొత్తపల్లి మూర్తి ఘనంగా స్వాగతం పలికారు. అప్పిరెడ్డికి వివిధ రకాల మొక్కలను వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కడియం ప్రాంత నర్సరీలు ఎంతో కీలకమన్నారు. అనంతరం కొత్తపల్లి మూర్తి అతిథి గృహానికి వెళ్లారు.

రూ. 20 వేల పింఛన్ సొమ్ము గల్లంతు

కడియం: దుళ్ల సచివాలయం 2 పరిధిలో పింఛన్లకు సంబంధించిన రూ.20 వేలు గల్లంతైంది. వివరాల్లోకి వెళితే.. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ లాల్‌బీబీ శుక్రవారం బ్యాంకు నుంచి పెన్షన్ సొమ్ము విత్‌డ్రా చేసి తీసుకువచ్చారు. 24 మంది వలంటీర్లకు వాళ్ల పరిధిలో పంపిణీ చేసేందుకు అవసరమైన సొమ్మును అందజేశారు. చివర్లో లెక్కలు చూసేసరికి రూ. 20 వేలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమై సంబంధిత వలంటీర్లను విచారణ చేశారు. అయితే సొమ్ముకు సంబంధించిన ఆచూకీ లభించలేదు. ఉన్నతాధికారుల దృష్టికి విషయం వెళ్లడంతో వారు విచారణ ప్రారంభించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కడియం: విజయవాడ నుంచి కాకినాడకు తరలిస్తున్న 70 బస్తాల పీడీఎస్ బియ్యం, బొలెరో వాహనాన్ని కడియం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ కె.సూర్య ప్రభాకరరావుకు అందిన సమాచారం మేరకు పోలీసుల సహకారంతో కడియం మండలం వేమగిరి జంక్షన్‌లో బియ్యాన్ని పట్టుకున్నారు. ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లజర్ల మండలం గంటావారిగూడెం దోపిదర్ల గ్రామానికి చెందిన తానెం ప్రసాద్‌పై ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ కేసు నమోదు చేశారు.

గురుపౌర్ణమికు ఏర్పాట్లు

కడియం: మండలంలోని సాయిబాబా ఆలయాల్లో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమిని నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన కడియం, వేమగిరి, కడియపులంక, మురమండ, దుళ్ల గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయ కమిటీలు తెలిపాయి. అలాగే ఆయా గ్రామాల్లో పల్లకీ సేవలు ఉంటాయన్నారు.

నగరంలో శాంతి ర్యాలీ



ర్యాలీ చేస్తున్న బిషప్ థామస్ తదితరులు

సీటీఆర్ఐ: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను అరికట్టడంతో పాటు అక్కడ క్రైస్తవులకు రక్షణ కల్పించాలని బిషప్ థామస్ అన్నారు. దహించు అగ్ని ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రార్థనా మందిరం నుంచి ప్లకార్డులతో నినాదాలు చేస్తూ కంబాలచెరువు వరకూ ప్రదర్శన చేశారు. బిషప్ థామస్ మాట్లాడుతూ మణిపూర్‌లో విద్రోహ శక్తులు 36 గంటల వ్యవధిలో 249 చర్చిలను కూల్చివేసి, తగుల బెట్టాయన్నారు. ఇటీవల అనేక ప్రాంతాలలో క్రైస్తవులు, పాస్టర్లపై దాడులు జరుగుతున్నాన్నారు. ప్రముఖ న్యాయవాది బెన్నీలింగం, షీబా థామస్, క్రిస్టఫర్ పాల్గొన్నారు.

యోగా గురువుకు సత్కారం

ప్రకాశం నగర్: రాజయోగ అభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కలుగుతుందని సీనియర్ రాజయోగి బాలకృష్ణ తెలిపారు. స్థానిక బాబానగర్ ఏపీపీ రోడ్డులోని బ్రహ్మకుమారీస్ రాజయోగ శిక్షణా కేంద్రంలో సంస్థ నిర్వాహకురాలు బీకే సత్యవాణి ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. కరోనా సమయంలో వేలమందికి ప్రాణాయామం, సూర్య నమస్కారాల ద్వారా ఉపశమనం కలిగించినందుకు యోగా గురువు పతంజలి శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కె.పార్థసారథి పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైఎంఏ హాలులో జరిగిన జిల్లా ఓపెన్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో షణ్ముఖ రెడ్డి, రామ్ చరణ్ తేజ విజయం సాధించారు. వీరు జూలై 22, 23 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో జోరుగా విక్రయాలు

- డిజిటల్ బాటలో చిల్లర వ్యాపారం
- పెరుగుతున్న ఆసక్తి



ప్రకాశం నగర్: షాపింగ్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో ప్రజలు తమకు కావాల్సిన వస్తువులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. గతంలో ప్రధాన నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ ప్రక్రియ ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది. దుస్తులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీమార్ట్, ఫ్లిప్ కార్టు, జియో మార్ట్, రిలయన్స్ సూపర్ మార్కెట్ వంటి కార్పొరేట్ సంస్థలు నిత్యావసరాలైన బియ్యం, వివిధ రకాల పప్పులు, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, వంట నూనెలు వంటి వాటిని సైతం ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాయి. మార్కెట్ వెళ్లి వస్తువులను కొనుగోలు చేసే పనిలేకుండా షాపింగ్ మరింత సులభంగా మారింది.

కార్డులపై ఆఫర్లు

ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లలో క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా సరకుల కొనుగోలుపై ప్రత్యేక డిస్కౌంట్లతో పాటు కార్డుల వినియోగంపై ప్రత్యేక పాయింట్ల ద్వారా క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అందిస్తున్నారు. మార్కెట్‌తో పోల్చితే ధరలు తక్కువగా ఉండడం, కొన్ని రకాల వస్తువులపై ఎంఆర్‌పీ కంటే ధర తక్కువగా ఉండడంతో ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్‌పై మక్కువ చూపిస్తున్నారు.

పలువురికి ఉపాధి

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తువులను ఆయా వినియోగదారుడి ఇంటి వద్దకే డోర్ డెలివరీ చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంగా మారిన తర్వాత రాజమహేంద్రవరంలో ప్రధాన కార్పొరేట్ వ్యాపార సంస్థలు ఇక్కడ తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. వినియోగదారులు ఆర్డర్ చేసిన వస్తువులను ఆటోలు, బైక్‌లపై ఆయా సంస్థల ఉద్యోగులు ఇంటి వద్దకే తెచ్చిఇస్తున్నారు. దీంతో ఆయా సంస్థల్లో పని చేసే వారికి ఉపాధి దొరుకుతోంది. వీరితో పాటు నగరంలోని పలువురు కిరాణా వ్యాపారులు హోల్‌సేల్‌గా అధిక మొత్తంలో సరకులను కొనుగోలు చేసి, రిటైల్ (చిల్లర)గా విక్రయాలు సాగిస్తుంటారు.

పలు మార్పులు



రిటైల్ వ్యాపారంలోకి కార్పొరేట్ సంస్థలు అడుగు పెట్టడంతో వ్యాపార రంగంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చిరువ్యాపారుల మనుగడ కష్టంగా మారింది. గతంతో పోల్చితే ఇప్పుడు వ్యాపారాలు తగ్గాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఒక వస్తువు ధర, దాని నాణ్యత వంటి అన్ని వివరాలు ఇప్పుడు వినియోగదారుడు తెలుసుకునే కొనుగోలు చేస్తున్నాడు.

– వెంకట రమణ, కిరాణా వ్యాపారి

యాక్టివిటీ సెంటర్ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ బిబ్లాక్‌లోని గురజాల అక్కమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఎంపీ నిధులు రూ.4 లక్షలతో నిర్మించిన గురజాల అక్కమ్మ తల్లి మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్‌ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం ప్రారంభించారు. ఆయనకు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కమ్మతల్లికి ఎంపీ పూజలు చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు పుచ్చా సత్యనారాయణరెడ్డి, మీగడ గంగాధర్, రుంకాని రమణమ్మ, కడవకొల్లు వెంకటరమణ, సఫారీ నాయుడు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ మృతికి సంతాపం

ప్రకాశం నగర్: సీనియర్ ఫొటోగ్రాఫర్ పిల్లి రాము సంతాప సభ ఆదివారం గాంధీపురంలోని సాయి బాలాజీ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాము చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైద్యులకు ఘనంగా సత్కారం



వైద్యులను సత్కరిస్తున్న దినేష్‌కుమార్, శివరామ సుబ్రహ్మణ్యం

సీటీఆర్ఐ: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్యవైశ్య వైద్యులు, మెడికోలను సత్కరించారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన గౌతమ ఘాట్ వద్ద ఉన్న చాంబర్ ట్రస్టు ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. కమిషనర్ దినేష్ కుమార్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నగరంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన 50 మంది వైద్యులు, 25 మంది మెడికోలను కమిషనర్ దినేష్ కుమార్, శివరామ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా సన్మానించారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్నవారికి ప్రాణం పోసే దేవుళ్లు వైద్యులన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో వైశ్య హాస్టల్ కమిటీ అధ్యక్షుడు కోట్ల కనకేష్, మండవిల్లి శివ, వైఎంవీఏ అధ్యక్షుడు కోడూరి శేషగిరి, నాళం కల్యాణ్, తొంటెపు స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- ఎంపీ భరత్ రామ్
- ఘనంగా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ఎంపీ భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కాలంతో పాటు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఫొటోగ్రఫీలో రాణించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపునిచ్చారు. ది గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఇన్నీసుపేట అల్యూమినియం అసోసియేషన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అల్లు బాబీ అధ్యక్షత వహించగా, ఎంపీ భరత్‌రామ్, ఏపీజీఅండ్‌బీసీ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యకలాపాలకు త్వరలో నిర్మించబోయే శ్రామిక భవనంలో ఒక రూమ్ ను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఈఎస్ఐ కట్టుకుంటే, మీ కుటుంబానికి భరోసాగా ఉంటుందని సూచించారు. జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు రాజకీయంగా ఎదగడానికి ఫొటోగ్రాఫర్ల పాత్ర ఎంతో ఉందని, అందుకే మా కుటుంబంలో భాగంగా మారిపోయారన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లకు ఎలాంటి సాయం కావాలన్నా చేయడానికి సిద్ధమని చెప్పారు.

నూతన కార్యవర్గ సభ్యులు

అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా అల్లు బాబీ, అధ్యక్షుడిగా చిట్టిమేను నాగశ్రీనివాస్ యాదవ్, సెక్రటరీగా సోమిరెడ్డి నాగకుమార్, ట్రెజరర్‌గా మజ్జి రాంబాబు, కోఆర్డినేటర్‌గా వానపల్లి బాబీ, గౌరవ సలహాదారులుగా ఏపీ నారాయణరావు(రావుఅండ్‌రావు), కోని శ్రీను, కేతా శ్రీను, గోకవరం బాలు, తప్పెట్ల రామ ప్రభాకర్, సలహా దారులుగా మయూరి శివ, ఎస్అండ్ఎస్ శేఖర్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని సురేష్, ఎన్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

లారీ బోల్తా : నలుగురికి తీవ్రగాయాలు



వేమగిరి వద్ద బోల్తా పడిన చేపల లారీ

కడియం: చేపల లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి వేమగిరి వద్ద డివైడర్‌పైకి ఎక్కి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డివైడర్‌పై ఉన్న ఇద్దరితో పాటు లారీ డ్రైవర్, క్లీనర్లు తీవ్ర గాయాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి పాట్నాకు చేపల లోడుతో వెళుతున్న లారీ వేమగిరి పాయిజన్ రెస్టారెంట్ వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కేసింది. ఆ సమయంలో డివైడర్‌పై ఉన్న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు విషవాలాకు చెందిన శాంతారామ్‌నింబా, సూరత్ జిల్లాకు చెందిన మహారు రఘునాథ్ తోరాట్ కాళ్ల మీదుగా దూసుకువెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ కాళ్లు విరిగి పోయాయి. అలాగే లారీ డ్రైవర్, క్లీనర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనను చేసిన స్థానికులు వెంటనే హైవే, పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. జాతీయ రహదారిపై తిరగబడిన లారీని పక్కకు తొలగించి, ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడియం హెచ్‌సీ రాజేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- ఎంపీ భరత్‌రామ్
- నగరంలో పర్యటన



7వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంపీ భరత్ రామ్ తదితరులు

సీటీఆర్ఐ: నగరంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. 7వ డివిజన్ బొమ్మన అపార్ట్‌మెంట్ వద్ద పలు అభివృద్ధి పనులపై ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలు, అలాగే తాను చూసిన సమస్యలు, వార్డు ఇన్‌చార్జులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. నగరంలోని 7, 8 డివిజన్‌లో దాదాపు రూ.కోటి, రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దానవాయిపేట, ప్రకాశం నగర్ ప్రాంతాలలో పూర్తిస్థాయి సీసీ రోడ్లకు మరో రూ.రెండు కోట్లు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. నగరంలో రమారమి వంద కిలో మీటర్ల మేర బీటీ రోడ్ల స్థానే సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. త్వరలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కలిసి నిధులు మంజూరుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 7వ వార్డు ఇన్‌చార్జి ఎస్టీ గౌస్, మార్గాని సురేష్, ఎన్వీ శ్రీనివాస్, మజ్జి అప్పారావు, హబీబుల్లా ఖాన్, నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, డీఈ డీఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు.

జీవితంలో గురువు కీలకం

మనిషి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఉత్తమ గురువు ఆశీస్సులు చాలా ముఖ్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీ షిరిడీ సాయితత్వ సాధనా సత్సంగ్ ఆధ్వర్యంలో మహా గణపతికి సామూహిక గరిక పూజ నిర్వహించారు. 28 రోజుల పాటు 28 మంది భక్తుల గృహాలలో సాయినామ స్మరణ నడుమ నిర్వహించిన శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణ ప్రవచన యజ్ఞం సమాపనోత్సవంలో భాగంగా గురుపౌర్ణమిని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

యువత వినూత్నంగా ఆలోచించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/రాజమహేంద్రవరం సిటీ: యువత తలచుకుంటే దేనినైనా సాధించవచ్చని ఎంపీ భరత్ రామ్ పిలుపునిచ్చారు. నగరంలోని జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాల సమీపంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌లో ఎంపీ భరత్, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తదితర ప్రముఖులు సరదాగా గడిపారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలూ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అడపా శ్రీహరి, ఎన్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, పిల్లి నిర్మల, కాంతారాం పాటిల్, గణేష్ పాల్గొన్నారు.

గోదావరిని కాపాడుకోవాలి



గోదావరిలో చెత్తను తొలగిస్తున్న టీమ్ సభ్యులు

గోదావరిని కాలుష్యం నుంచి కాపాడుకోవాలని బ్రింగ్ బ్యాక్ గ్లోరి టీమ్ సభ్యులు అన్నారు. ఆదివారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పుష్కర్ ఘాట్ వద్ద సుమారు 200 మీటర్ల విస్తరణలో పేరుకుపోయిన సుమారు సుమారు 550 కేజీల చెత్తను 30 మంది వలంటీర్లు తొలగించారు. వారు మాట్లాడుతూ బ్రింగ్ బ్యాక్ ది గ్లోరీ గోదావరీ టీమ్ జూన్-2022 లో ప్రారంభించి సోషల్ మీడియా వేదికగా గోదావరిపై ప్రాముఖ్యత వివరించి ఈ క్లీనింగ్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. ప్రతి ఆదివారం ఒక్కో ఘట్ వద్ద ఈ డ్రైవ్ చేపడతామన్నారు. సభ్యులు మైగపలి నాగరాజు, తాడిమళ్ల చరణ్ సంజీవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లో ఆయన సమక్షంలో పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరారన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జేఎల్‌బీ నగర్ నుంచి కొమ్ము దుర్గాప్రసాద్, పైలా సత్యవతి, నీలం రాజా, రాపాక నాగరాజు, మాగాపు సత్తిబాబు, పద్మ, కుమార్, రాజు, కేశవ్, శ్రీనివాస్, రామపండు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జేసీఎస్ కన్వీనర్లు విష్ణుమూర్తి, రాజమౌళి, పార్టీ నాయకులు ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, మచ్చెట్టి శివ, సద్గుణ రామారెడ్డి, దాకే శ్రీను, కేవీ సుబ్బారెడ్డి, సోమన శ్రీను, కాకులపాటి కుమార్, పెయ్యాల రాజేశ్, తోడేటి రాజా, వైఎస్ కుమార్, అంగాడ సత్యప్రియ పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాల తనిఖీ



బొమ్మూరులో విద్యార్థినులతో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి రమేష్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ ఆదివారం రాజమహేంద్రవరంలోని వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వసతి గృహం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం, కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలోని సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహం, ప్రకాశం నగర్‌లోని గ్రేస్ చిల్డ్రన్‌మిషన్ హోమ్‌ను సందర్శించారు. అక్కడి మౌలిక సదుపాయాలను, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. అంతకు ముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ జ్యుడీషియల్ అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులతో జువైల్ జస్టిస్ బోర్డ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోక్సో కేసుల వివరాలు, సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై సమీక్షించారు. ఆయన వెంట డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఇతర న్యాయమూర్తులు, రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ఎస్.సుభాషిణి ఉన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

కడియం: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అప్పుడే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ హేమనళిని అన్నారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో ఆదివారం వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు, కౌమార దశ బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంస్థ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలు, యువతులు, వివాహితలు, తల్లుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈలి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనా స్థలంలో బుల్లెట్

రంగంపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట శివారు ఎస్టీ కాలనీ ఎదురుగా ఏడీబీ రోడ్డుపై సైకిల్‌పై రోడ్డు దాటుతున్న రావూరి గురునాథాన్ని రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వైపు బుల్లెట్ బండిపై వెళుతున్న నురుకుర్తి నెహేమియా ఢీకొన్నాడు. బుల్లెట్ బండి అదుపు తప్పి రోడ్డు పక్కనున్న టాటాఏస్ వాహనాన్ని ఢీకొని ఇసుక గుట్టపై పడింది. ఈ ప్రమాదంలో బుల్లెట్ వెనుక కూర్చున్న కనపర్తి సాయికుమార్ తలకు బలమైన గాయం, నెహేమియా తల్లి నాగలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో కనపర్తి సాయికుమార్(22) మృతి చెందాడని తెలిపారు. దీంతో మృతుడి తల్లి వీరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

జన విజ్ఞాన వేదిక జిల్లా సమావేశం

కంబాలచెరువు: స్థానిక యూటీఎఫ్ హోంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎన్ రమేష్ హాజరై మాట్లాడుతూ ప్రశ్నించడం, పరిశీలించడం, ప్రయోగం చేయడం, నిర్ధారించడం అను అంశాలతో శాస్త్రీయ నిర్మాణానికి జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ప్రజలు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలన్నారు. జిల్లా కన్వీనర్ ఎం.మల్లికార్జునరావు, అధ్యక్షులు ఎస్.రవిబాబు తదితరులు మాట్లాడారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు వై.పైడియ్య, డాక్టర్ చైతన్య శేఖర్, పీఎస్ఎన్.రాజు, తోరాటి వసంతరావు, సుధాకర్, నాగేశ్వరరావు, గోపాల్ పాల్గొన్నారు.

సూర్యదేవునికి పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు.